క్లుప్తంగా

ఇళ్ల పట్టాల పంపిణీ



ఇళ్ల పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలో 59 జీఓ కింద 10 మంది లబ్దిదారులకు ఇళ్ల పట్టాలను శనివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ.. ఇళ్ల స్థలాలు ఉండి పట్టాలు లేక ఇబ్బంది పడుతున్న పేద ప్రజలకు ఆ స్థలాలను రెగ్యులరైజ్ చేసిన నాయకుడు సీఎం కేసీఆర్ అని అన్నారు. ఒక పక్క సంక్షేమం మరో పక్క అభివృద్ధితో పాటు నిరుపేదలకు ఇంకా ఏదో చేయాలన్న ఆలోచన సీఎం కేసీఆర్ అని, అందుకనే ఎంతో కాలంగా నివాసం ఉంటూ వారికి ఎటువంటి భరోసా లేని సందర్భంలో సీఎం కేసీఆర్ వారి నివాసాలను రెగ్యులరైజ్ చేయటం శుభ పరిణామం అన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట



శ్మశాన వాటికలో నిర్మిస్తున్న ప్రహరీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హైదర్‌నగర్ ఆలీ తలాబ్ చెరువ వద్ద ముస్లిం శ్మశాన వాటికలో రూ.30 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న ప్రహరీ నిర్మాణ పనులను శనివారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. అదే విధంగా అడ్డగుట్ట సొసైటీలో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై కాలనీవాసులతో కలిసి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదర్‌నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని, శ్మశాన వాటికల్లో సకల సదుపాయాలతో సుందరవనంగా మహాప్రస్థానం లాగా తీర్చిదిద్ది, ఆహ్లాదకమైన వాతావరణం కల్పించి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. అదే విధంగా అడ్డగుట్టలో స్థానికుల విజ్ఞప్తి మేరకు పాదయాత్ర చేపట్టడం జరిగిందన్నారు. ప్రజా సమస్యలే పరిష్కార ధ్యేయంగా ముందుకు వెళ్తున్నానన్నారు. కాలనీవాసులు అందరూ కలిసి కాలనీని సమష్టి కృషితో ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు వల్లభనేని సుబ్బారావు, బీవీఎం రెడ్డి, ఎంఎస్ఎస్ రాజు, చంద్రరావు, సత్యనారాయణరెడ్డి, శ్రీనివారాజు, బెనర్జీ, నాయకులు పోతుల రాజేందర్, అష్రాఫ్ బిన్‌హది, ఖదీర్, షరీఫ్, ఎండీ జాకీర్ ఫారుఖాన్, యాదుల్ మాధవ్, నిరంజన్‌గౌడ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేదవ్ పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి



మురుగునీటి సమస్యను పరిశీలించిన కార్పొరేటర్ శ్రీనివాసరావు తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ మూడవ ఫేజ్‌లోని ఎంఐజి 17 వద్ద హోటల్ నుంచి వస్తున్న వ్యర్థాలుతో డ్రైనేజీ బ్లాక్ అయి మురుగు నీరు రోడ్డుపై ప్రవహించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం పలువురు స్థానికులు కార్పొరేటర్ దృష్టికి సమస్యలను తీసుకురావటంతో ఆయన ఆ ప్రాంతానికి వచ్చి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హోటల్ నిర్వాహకులు కూడా సామాజిక బాధ్యత వహించి వ్యర్థాలు డ్రైనేజీలో కలగకుండా చూసుకోవాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యూఎస్ సూపర్‌వైజర్ వెంకటేష్, ఎస్ఆర్‌పీ శ్రీనివాస్, ఎస్ఎస్‌పీ సూరి, నరేష్ బాబు, భాస్కర్, జీఎల్ రెడ్డి, కచ్చిన్, గఫూర్, పద్మారెడ్డి, సుబ్బు, రాము తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదం

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ కాలనీ మూడవ ఫేజ్‌లో షార్ట్ సర్క్యూట్‌తో పేపర్‌షాపు శుక్రవారం అర్ధరాత్రి దగ్ధమైంది. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు శనివారం ఆ ప్రాంతాన్ని పరిశీలించి షాపు యజమానికి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సురేష్‌రెడ్డి, భాస్కర్, జీఎల్ రెడ్డి, కచ్చిన్, పద్మారెడ్డి, సుబ్బురాము తదితరులు పాల్గొన్నారు.

నిధుల ఖర్చుకూ బద్ధకమే..!

అభివృద్ధి పనులకు నిధులు ఖర్చుచేయని ఎమ్మెల్యేలు

- ఐదుగురు ఎమ్మెల్యేలకు 2021-22లో రావాల్సిన సీడీపీ నిధులు 15 కోట్లు
- ప్రభుత్వం కేటాయించింది రూ. 9.36 కోట్లు
- వివిధ అభివృద్ధి పనులకు చేసిన ఖర్చు రూ. 3.39 కోట్లు
- 2022-23లోనూ రూ.7.06 కోట్ల కేటాయింపు - ఖర్చు చేసింది సున్నా

సాక్షి, మేడ్చల్ జిల్లా: నియోజకవర్గాల్లోని సమస్యల పరిష్కారానికి నియోజకవర్గ అభివృద్ధి పథకం కింద ఎమ్మెల్యేకు ప్రభుత్వం ఏటా నిధులు విడుదల చేస్తుంది. ప్రభుత్వం కేటాయించిన నిధులతో తమ నియోజకవర్గాల్లో పనులు చేయించాలి. అయితే కొందరు ఎమ్మెల్యేలు మాత్రం వాటిని వినియోగించడంపై శ్రద్ధ చూపడం లేదు. ప్రభుత్వం ఏటా ప్రతి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి రూ.5 కోట్లు విడుదల చేస్తోంది.

40 శాతం నిధులు ప్రభుత్వ బడులకే...

నియోజకవర్గ అభివృద్ధి పథకం కింద ఎమ్మెల్యేలకు ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధుల్లో 40 శాతం నిధులను నేరుగా మన ఊరు- మన బడి కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కేటాయిస్తున్నారు. ఇక మిగతా 80 శాతం నిధులు ప్రజాప్రతినిధులు నియోజకవర్గాల్లో ప్రజల సమస్యలు తీర్చేందుకు వినియోగించాల్సి ఉంటుంది. గ్రామాల్లో రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం, తాగు నీటి సౌకర్యాలతో పాటు ప్రజలకు అవరమయ్యే ఇతర సదుపాయాలు కల్పించేందుకు ఖర్చు చేయాల్సి ఉంది.



నియోజకవర్గం అభివృద్ధి నిధుల ఖర్చు ఇలా

మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలో నియోజకవర్గ అభివృద్ధి పథకం కింద 2021-22 సంవత్సరంలో ప్రభుత్వం ఐదుగురు ఎమ్మెల్యేలకు రూ.15 కోట్లు మంజూరు చేయగా అందులో రూ.936.46 లక్షలు నిధులను 234 అభివృద్ధి పనులకు కేటాయించారు. వాటిలో 113 పనులు పూర్తి కాగా, ఇంకా 121 పనులు ప్రారంభానికి నోచుకోలేదు.

మంత్రి నియోజకవర్గంలో కేవలం 74 లక్షలే ఖర్చు



మంత్రి మల్లారెడ్డి

- మేడ్చల్‌లో సీడీపీ కింద 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఎమ్మెల్యే మంత్రి సీహెచ్ మల్లారెడ్డికి ప్రభుత్వం రూ.3 కోట్లు నిధులు మంజూరు చేసింది. నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.248 లక్షలు కేటాయించారు. అందులో ఇప్పటి వరకు రూ.74.31 లక్షలకు సంబంధించిన పనులు మాత్రమే పూర్తయ్యాయి. మిగతా రూ.173.69 లక్షలతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు.

కుత్బుల్లాపూర్‌లో ఇలా..



ఎమ్మెల్యే వివేకానంద్

- కుత్బుల్లాపూర్‌లో 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు ప్రభుత్వం రూ.3 కోట్లు నిధులు మంజూరు చేయగా వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.247.50 లక్షలు కేటాయించారు. అయితే ఇప్పటి వరకు రూ.128.40 లక్షల విలువ చేసే అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. మరో రూ.36.79 లక్షలతో చేపట్టిన పనులు పురోగతిలో ఉన్నాయి. మిగతా రూ.82.31 లక్షలతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు పూర్తి కావాల్సింది.

మల్కాజిగిరిలో సున్నా..



ఎమ్మెల్యే మైనంపల్లి

- మల్కాజిగిరిలో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుకు ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేయగా వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.265.50 లక్షలు కేటాయించారు. అయితే ఇప్పటి వరకు ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా పూర్తి కాలేదని తెలుస్తోంది.

ఉప్పల్‌లో అంతంతే..



ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

- ఉప్పల్‌లో సీడీపీ కింద 2021-22లో ఎమ్మెల్యే బి.సుభాష్‌రెడ్డికి ప్రభుత్వం రూ.3 కోట్లు విడుదల చేయగా వివిధ పనులకు రూ.241.74 లక్షలు కేటాయించారు. అందులో ఇప్పటి వరకు రూ.98.03 లక్షల విలువ చేసే అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. మిగతా రూ.143.71 లక్షలతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు ఇంకా ప్రారంభం కాలేదు.

కూకట్‌పల్లిలో ఒక్కటీ పూర్తి కాలే..



ఎమ్మెల్యే కృష్ణారావు

- కూకట్‌పల్లిలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు రూ.3 కోట్లు నిధులు మంజూరు చేయగా వివిధ పనుల కోసం రూ.246 లక్షలు కేటాయించారు. అందులో ఇప్పటి వరకు ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా పూర్తి కాలేదు. ఎమ్మెల్యే అలసత్వం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా పనులు జాప్యంగా కొనసాగుతున్నాయి. జిల్లాలో ఐదుగురు ఎమ్మెల్యేలకు నిధులు విడుదలై ఏడాది గడిచినా వాటి వినియోగంలో జాప్యంతో సమస్యలు పరిష్కారం కావడం లేదని, ఆయా నియోజకవర్గాల్లో ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

అన్ని చోట్లా...ఇంకా వెయిటింగే..

2022-23 సంవత్సరానికి గాను జిల్లాలో ఐదుగురు ఎమ్మెల్యేలకు సంబంధించి రూ.15 కోట్లకు గానూ ప్రభుత్వం సీడీపీ కింద 706.55 లక్షలు కేటాయించింది. ఈ నిధులతో 165 పనులకు ఆమోదం లభించింది. అయినా.. ఇప్పటి వరకు ఒక్క పని కూడా పూర్తి కాలేదు. 2022-23లో మేడ్చల్ ఎమ్మెల్యే, మంత్రి మల్లారెడ్డి రూ.149.85 లక్షలు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ రూ. 117 లక్షలు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు రూ. 268 లక్షలు, ఉప్పల్ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి రూ.171.70 లక్షల నిధులను వివిధ అభివృద్ధి పనుల కోసం కేటాయించినా ఇప్పటి వరకు ప్రారంభం కాలేదు.

ఉచిత వైద్య శిబిరం



మోతీనగర్: మధుమేహం, బీపీ వంటి వ్యాధులు వయసుతో నిమిత్తం లేకుండా వస్తున్నాయని నీలిమా ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం మోతీనగర్ హనుమాన్ ఆలయం వద్ద ఉచిత మెగా డయాబెటిస్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరం డాక్టర్ నవీన్‌చంద్రరెడ్డి పర్యవేక్షణలో కొనసాగింది. సుమారు 200 మంది వరకు పరీక్షలు నిర్వహించారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు ఈ శిబిరం కొనసాగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నీలిమ సిబ్బంది వెంకటేశ్వర్లు, గోపి, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీనివాస కల్యాణం



తిరుమల నుంచి తీసుకువచ్చిన కల్యాణ విగ్రహం

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీలోని కేకేఆర్ వారి ఎస్ఎంఆర్ వినయ్ ఫౌంటైన్ హెడ్‌లో శనివారం శ్రీనివాస కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తిరుపతి నుంచి వచ్చిన అర్చకులు తిరుపతి నుంచి తీసుకువచ్చిన కల్యాణ విగ్రహాలకు కల్యాణాన్ని అద్భుతంగా జరిపించారు. ఈ కల్యాణంలో సుమారు 3 వేల మంది భక్తులు పాల్గొని తన్మయం చెందారు. ఈ కార్యక్రమాన్ని యూట్యూబ్ ద్వారా ప్రసారం చేసేందుకు, అనేక మంది భక్తులు వీక్షించేలా ఏర్పాటు చేశారు.

ఏటీఎం సెంటర్‌లో రూ. 5లక్షల చోరీ

చోరీకి పాల్పడింది టెక్నీషియన్‌గా గుర్తించిన పోలీసులు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ కాలనీలోని ఓ ఏటీఎం సెంటర్‌లో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత చోరీ జరిగింది. ఏటీఎం కేంద్రం తాళాలు పగులగొట్టి రూ.5 లక్షల నగదును దోచుకెళ్లారు. మహారాష్ట్ర బ్యాంక్ ఏటీఎం సెంటర్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తున్న వ్యక్తి ఈ చోరీకి పాల్పడినట్లు సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు గుర్తించారు. ఏటీఎం షట్టర్ తాళం పగుల గొట్టి ఉండటాన్ని గమనించిన స్థానికులు అనుమానంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న కేపీహెచ్‌బీ పోలీసులు, ఏటీఎం షట్టర్ తెరిచి చూడగా, ఏటీఎం మెషిన్ తెరిచి ఉండటంతో వారు బ్యాంక్ సిబ్బందికి సమాచారం అందించారు. ఏటీఎం వద్దకు చేరుకున్న బ్యాంక్ సిబ్బంది, ఏటీఎంలోని రూ.5 లక్షలు చోరీకి గురైనట్లు గుర్తించారు. బ్యాంక్ సిబ్బంది టెక్నీషియన్ హరీష్‌గా పోలీసులు గుర్తించారు. రెండు రోజుల క్రితం బ్యాంక్‌కు వచ్చిన టెక్నీషియన్ హరీష్ ఏటీఎం సర్వీసింగ్ చేస్తున్న క్రమంలో బ్యాంక్ మేనేజర్ వద్ద ఉన్న ఏటీఎం తాళం చెవులను నకిలీవి తయారు చేయించుకోవడంతో పాటు లాగిన్ ఐపీ అడ్రస్, పిన్ నెంబర్‌లు ఎంటర్ చేసేటప్పుడు చూసి వాటిని తన ఫోన్‌లో భద్రపరుచుకొని, వాటి ద్వారా ఏటీఎం తెరిచి దొంగతనానికి పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. బ్యాంక్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న కేపీహెచ్‌బీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



చోరీకి పాల్పడిన నిందితుడి సీసీ కెమెరా ఫుటేజ్

రాజకీయాలకు అతీతంగా ఆలయ అభివృద్ధి జరగాలి



ఓల్డ్ బోయిన్‌పల్లి: అంజయ్యనగర్‌లోని వీర అభయాంజనేయ స్వామి దేవాలయ నిర్మాణం ఆధ్యాత్మిక క్షేత్రంగా వెలుగొందేలా నిర్మాణం జరిగేలా అందరి సహకారం కావాలని కనకదుర్గ ఆలయ చైర్మన్ మక్కాల సత్యనారాయణ ఆకాంక్షించారు. శనివారం ఆలయంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక కమిటీ సమావేశంలో సత్యనారాయణతో పాటు గ్రేటర్ హైదరాబాద్ గొల్లకుర్మ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు కనకరాజు యాదవ్ ఆలయ నిర్మాణానికి చెరో లక్ష నూట పదహారు రూపాయల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహాయ సహకారంతో కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, ఆలయ చైర్మన్ మక్కాల బలరాం సమక్షంలో వీర అభయాంజనేయ స్వామి ఆలయం పునర్‌నిర్మాణం కార్యక్రమం వైభవంగా జరగడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ రాజకీయాలకు అతీతంగా ఆలయ నిర్మాణం కోసం పాటు పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జునయాదవ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బలరాజు, జయశంకర్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఫిరోజ్, అంజీ, నర్సింగ్‌రావు, రమేష్, రాజు, అశోక్, మధు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

మోతీనగర్: ప్రతి వ్యక్తి తన దినచర్యను ఆధ్యాత్మికచింతనతో ప్రారంభించినట్లయితే విజయం సాధించడం ఖాయమని శివరామ ఆంజనేయ ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. శనివారం శివరామ ఆంజనేయ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన, కుంభాభిషేక మహోత్సవంలో భాగంగా నాలుగవ రోజు గణపతి పూజ, పుణ్యాహవాచనం, గోపూజ, ఉదయశాంతి ప్రయోగం, సమిత్పంచక హోమం, మూర్తిపతి లోకపాల చతుర్వేద మంత్ర హవనములు, ప్రధాన దేవ హోమములు, కళాన్యాస హోమాలు, అంగ హోమం, సంభార హోమములు, దిక్పాలక నవగ్రహ హోమాదులు నిర్వహించారు. సాయంత్రం 5 నుంచి 8.30 గంటల వరకు ప్రదోషకాల పూజ, పుష్పాధివాసం, పంచశయ్యాధివాసం, ప్రధాన కలశ స్థాపన పూజ, తత్వన్యాసములు, నీరాజన మంత్ర పుష్పములు, తీర్థ ప్రసాద వినియోగం, సాయంత్రం 6 నుంచి 7.30 గంటల వరకు శ్రీ పుష్పగిరి పీఠం ఆస్థాన పండితులు మేడూరి సూర్యనారాయణ శర్మచే ప్రవచనం కార్యక్రమాలు నిర్వహించారు.

పూడికతీత పనుల పరిశీలన

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని దత్తాత్రేయ కాలనీ, మహంకాళినగర్ వరకు గల వరద నీటి కాలువ పూడికతీత పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని కాలనీలో ముంపునకు గురి కాకుండా చేపడుతున్న పనుల్లో భాగంగా వరద నీటి కాలువలో పేరుకుపోయిన మట్టిని తొలగిస్తున్నామన్నారు. అదే విధంగా సకాలంలో పనులను పూర్తి చేసి వరద నీటితో ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో వెంకట్‌నాయక్, బాలస్వామి, షౌకత్ ఆలీ మున్నా, పోశెట్టి గౌడ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కల్లు తాగిన మహిళ అస్వస్థతకు గురై మృతి



యశోద మృతదేహం

బాలానగర్: కల్లు తాగిన ఓ మహిళ అస్వస్థతకు గురై మరణించిన ఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఇంద్రానగర్ గుడిసెల్లో యశోద (27) భర్తతో మనస్పర్థలు రావటంతో తన ఇద్దరు పిల్లలతో కలిసి తల్లిదండ్రుల దగ్గర ఉంటుంది. ఈనెల 12న కల్లు తాగి వచ్చిన ఆమెను కుటుంబ సభ్యులు భోజనం చేసేందుకు లేపగా ఒళ్లు అంతా నొప్పులు ఉన్నాయని, లేవలేక పోతున్నానని చెప్పి నిద్రించింది. 13వ తేదీ ఉదయం 6.30 గంటలకు యశోద చెల్లెలు నిద్ర లేపేందుకు ప్రయత్నించగా ఆమెలో చలనం లేదు. కాలనీలో గల కల్లు కాంపౌండ్‌లో కల్లుతాగి అస్వస్థతకు గురై చనిపోయిందని తండ్రి రాములు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.







కాంగ్రెస్ పార్టీ శ్రేణుల సంబరాలు

కూకట్‌పల్లి: కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించిన సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నాయకత్వంలో గాంధీ భవన్, కూకట్‌పల్లి నియోజకవర్గంలో పీసీసీ సభ్యుడు సత్యం శ్రీరంగం ఆధ్వర్యంలో శనివారం పలు ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ.. కర్ణాటకలో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టడంతో తెలంగాణ కర్ణాటక ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ ప్రధానంగా అవినీతికి ఆజ్యం పోయడం వల్లే కర్ణాటక ప్రజలు బీజేపీని తిరస్కరించారన్నారు. ఈ కార్యక్రమంలో పుష్పారెడ్డి, నాగిరెడ్డి, ఎండీ మోయిజ్, తూము వేణు, బండారి నవీన్‌గౌడ్, మధుగౌడ్, మట్టే ప్రసన్నకుమార్, శేఖర్‌గౌడ్, గజానంద్‌శేఖర్ ఉన్నారు.

మోతీనగర్‌లో..

మోతీనగర్: కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజార్టీతో గెలుపొందిందని టీపీసీసీ సభ్యుడు, మాజీ కార్పొరేటర్ గొట్టిముక్కల వెంగళరావు తెలిపారు. అవినీతి బీజేపీ పాలనకు కర్ణాటక ప్రజలు అంతం చేశారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పల్లపు వేణు, జాకీర్ పాల్గొన్నారు.



గాంధీ భవన్ వద్ద జరిగిన సంబరాల్లో రేవంత్‌రెడ్డితో సత్యం శ్రీరంగం తదితరులు

బాలానగర్‌లో..

బాలానగర్: బాలానగర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మాదిరెడ్డి యుగంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకొన్నారు. ఈ కార్యక్రమంలో రాజు ముదిరాజ్, బాలనర్సింహ, అస్లాం, కృష్ణ, నరేందర్, బాలరాజు, ముక్తర్, అహ్మద్, రాఫ్ పాల్గొన్నారు.

ఫతేనగర్ డివిజన్‌లో..

ఫతేనగర్ డివిజన్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. సూరజ్ తివారీ ఆధ్వర్యంలో నిర్వహించిన విజయోత్సవ సంబరాల్లో పలువురు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నృత్యాలు చేశారు.



మూసాపేట ఇందిరాగాంధీ విగ్రహం వద్ద ..



హస్మత్‌పేట చౌరస్తాలో..



వెంకళరావుకు కేక్ తినిపిస్తున్న పల్లపు వేణు, కాంగ్రెస్ నాయకులు

మూసాపేటలో..

మూసాపేట: మూసాపేటలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ మూసాపేట డివిజన్ అధ్యక్షుడు చున్నూ పాషా ఆధ్వర్యంలో కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపొందడంతో సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గోపిశెట్టి రాఘవేంద్ర, మోయిజ్, తూము సంతోష్, శ్రీనివాస్, తూము వేణు, తూము సచిన్, శేఖర్‌గౌడ్, మోసిన్ పాల్గొన్నారు.

ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో..

ఓల్డ్ బోయిన్‌పల్లి: కర్ణాటకలో కాంగ్రెస్ విజయం సాధించడంతో ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో కాంగ్రెస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్‌యాదవ్ ఆధ్వర్యంలో హస్మత్‌పేట చౌరాస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సంబరాలు ఏర్పాటు చేశారు. టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి ముఖ్యఅతిథిగా హాజరై టపాకాయలను కాల్చి ప్రజలకు స్వీట్లను పంచిపెట్టారు. మాజీ డివిజన్ అధ్యక్షుడు రాజేందర్, డివిజన్ ప్రధాన కార్యదర్శి శ్రీరాములు, డివిజన్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ఆయుబ్‌ఖాన్, షర్ఫుద్దీన్, అఖిల్ హమ్మద్, అమ్జద్, అమర్, ఉదయ్ పాల్గొన్నారు.